క్లుప్తంగా

ఆంజనేయస్వామికి పంచామృతాభిషేకం



స్వామివారికి పూజలు చేస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: జిల్లాలో ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం రామతీర్థం శ్రీసీతారామస్వామి దేవస్థానంలో ఆంజనేయస్వామికి అర్చకులు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువ జామున స్వామికి ప్రాతఃకాలార్చన, అనంతరం ఆలయ ప్రధాన ముఖద్వారం ఎదురుగా ఉన్న ఆంజనేయస్వామికి పాలు, పెరుగు, తేనె, నెయ్యి, వివిధ రకాల ఫల రసాలతో అభిషేకాలు జరిపించారు. అనంతరం నూతన వస్త్రాలతో స్వామిని సుందరంగా అలంకరించి తమలపాకులు, సింధూరంతో అర్చనలు చేశారు. స్వామి సన్నిధిలో హనుమాన్ ఛాలీసా పఠించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు సాయిరామాచార్యులు, కిరణ్, పవన్, రామగోపాలాచార్యులు పాల్గొన్నారు.

12 నాటుబళ్లు పట్టివేత



పట్టుకున్న నాటుబళ్లతో రెవెన్యూ సిబ్బంది

నెల్లిమర్ల: స్థానిక చంపావతి నదిలో రెవెన్యూ అధికార్లు 12 ఇసుక నాటుబళ్లు పట్టుకున్నారు. చంపావతి నదిలో నీటి పథకాల వద్ద ఇసుక అక్రమంగా తవ్వి తరలిస్తున్న నాటుబళ్లను తహసీల్దార్ డి.ధర్మరాజు, రెవెన్యూ సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. ఈ క్రమంలో అక్రమార్కులు తహసీల్దార్‌తో వగ్వాదానికి దిగారు. దీంతో ఆయన పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడకు రావడంతో నాటుబళ్ల యజమానులు బళ్లను అక్కడే వదిలేసి ఎద్దులను తీసుకుని వెళ్లిపోయారు. అనంతరం తహసీల్దార్ ధర్మరాజు మాట్లాడుతూ.. తాగునీటి పథకాలు, వంతెనలకు 500 మీటర్ల పరిధిలో ఇసుక తవ్వకాలు చేపట్టరాదని, అనుమతి లేకుండా ఇసుక తవ్వకాలు చేపట్టినా, తరలించినా కేసులు నమోదు చేసి భారీగా జరిమానా విధించడం జరుగుతుందని హెచ్చరించారు.

ఆరోగ్య జాగ్రత్తలు తప్పనిసరి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సిబ్బంది

నెల్లిమర్ల: స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో మంగళవారం మలేరియా, డెంగీ, తదితర వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అర్బన్ మలేరియా అధికారి సురేష్, ఫైలేరియా సిబ్బంది బాబు విశ్వేశ్వరరావు, శ్రీనివాస్ సీజనల్ వ్యాధులు, మలేరియా, డెంగీ వ్యాధి లక్షణాలు, వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థినులకు వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శారద, వ్యాయామ ఉపాధ్యాయుడు ఆనంద్‌కిషోర్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం



కె.కొత్తవలసలో గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ స్రవంతి

దత్తిరాజేరు: గర్భిణులు, బాలింతలు విధిగా పౌష్టికాహారం తీసుకుంటే తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని కె.కొత్తవలస పీహెచ్‌సీ వైద్యాధికారి స్రవంతి అన్నారు. ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పీహెచ్‌సీలో 40 మంది గర్భిణులకు మంగళవారం వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. ఈసందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని తప్పకుండా తీసుకోవాలని చెప్పారు. పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు



రికార్డులు పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

జామి: మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్, వ్యవసాయశాఖ అధికారులు మంగళవారం సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. దుకాణాల లైసెన్స్‌లు, ఎరువులు, పురుగు మందుల నిల్వలు, వాటి కాలపరిమితి, రికార్డులను పరిశీలించారు. ఎరువులు, విత్తనాలను ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే విక్రయించాలని, అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. విజిలెన్స్ డీఎస్పీ ఎస్.తాతారావు, ఏలూరు వ్యవసాయశాఖ ఏడీ బి.గంగాధరరావు, జామి ఏఓ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

నరసింహమూర్తిగా జగన్నాథుడు



నరసింహమూర్తి అలంకరణలో జగన్నాథుడు

జగములనేలే జగన్నాథుని రథయాత్ర మహోత్సవాల్లో భాగంగా స్థానిక కోళ్ల బజారులో కొలువైన జగన్నాథ స్వామివారు మంగళవారం నరసింహ మూర్తి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు నగేష్ ఆచార్యులు, వెంకటరమణాచార్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా ఉల్లివీధిలో కొలువైన కోదండ రామాలయంలో కొలువై ఉన్న సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథస్వామికి అర్చకులు ఆరవెల్లి సూర్యనారాయణ ఆచార్యులు వరహా నరసింహమూర్తి అవతారంలో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

– విజయనగరం టౌన్

లోతట్టు ప్రాంతాలు జలమయం కాకుండా చర్యలు



మురుగునీటిని పరిశీలిస్తున్న కమిషనర్ మల్లయ్యనాయుడు

విజయనగరం: లోతట్టు ప్రాంతాలు జలమయం కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కమిషనర్ ఎం.ఎం నాయుడు సిబ్బందిని ఆదేశించారు. నగరంలోని 24వ డివిజన్‌లో మంగళవారం ఆయన పర్యటించి స్థానిక సమస్యలపై ఆరా తీశారు. కాలనీలోని ప్రధాన కాలువలో మురుగునీరు నిలిచిపోయి రోడ్డుపైకి రావడాన్ని గమనించారు. పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన శానిటరీ కార్యదర్శి, పారిశుధ్య సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మురుగునీరు మళ్లించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లో నీరు చేరే అవకాశం ఉన్నందున కాలువల్లో పూడికలు తొలగించాలని, లోతట్టు ప్రాంతాలు జలమయం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఆయన వెంట స్థానిక కార్పొరేటర్ కంటుభుక్త తవిటిరాజు, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

విస్తృతంగా వాహనాల తనిఖీ

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పోలీస్ అధికారులు, సిబ్బంది జిల్లా వ్యాప్తంగా మంగళవారం వాహన తనిఖీలు చేపట్టారు. మోటారు వాహన చట్టంలోని నిబంధనలు ఉల్లంఘించిన 459 మందిపై రూ.1,62,551లు అపరాధ రుసుం విధించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 16 మందిపై, అలాగే బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతూ ప్రజాశాంతికి భంగం కలిగించిన 33 మందిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ దీపిక తెలిపారు.

ఆకట్టుకున్న ఆధ్యాత్మిక సంగీత విభావరి



భక్తిగీతాలు ఆలపిస్తున్న పరమేష్

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడితల్లి అమ్మవారి చదురుగుడి ఆవరణలో మంగళవారం రాత్రి నిర్వహించిన ఆధ్యాత్మిక సంగీత విభావరి ఆకట్టుకుంది. ఆలయ ప్రాంగణంలో ఉన్న ఆధ్యాత్మిక కళావేదిక వద్ద నగవోలు పరమేష్ ఆలపించిన భక్తిగీతాలు ఆద్యాంతం సంగీత ప్రియులను అలరించాయి. అనంతరం ఆలయ ఈఓ ప్రసాదరావు పరమేష్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

భాస్కరరావు సేవలు ఎనలేనివి



మాట్లాడుతున్న పైడితల్లి ఆలయ ఈఓ ప్రసాదరావు

విజయనగరం టౌన్: పైడితల్లి అమ్మవారి సిరిమాను అధిరోహకులుగా, అమ్మవారి దేవస్థానంలో అర్చకులుగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించి, అందరికీ స్ఫూర్తిప్రదాతగా నిలిచిన దివంగత తాళ్లపూడి భాస్కరరావు సేవలు ఎనలేనివని అమ్మవారి ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు కొనియాడారు. భాస్కరరావు 5వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన తనయుడు దేవస్థానం ఉద్యోగి తాళ్లపూడి ధనుంజయ్ భక్తులకు మంగళవారం అన్నసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఈఓ ప్రసాదరావు మాట్లాడుతూ.. సిరిమానును అధిరోహించిన తాళ్లపూడి నిరంతరం అమ్మసేవలోనే తరించేవారన్నారు. ఆలయ సిబ్బంది ఆయన్ను స్ఫూర్తిగా తీసుకుని భక్తులకు సేవలందించాలని కోరారు. కార్యక్రమంలో బంటుపల్లి వెంకటరావు, రమేష్ పట్నాయక్, ఎం.బి.సత్యనారాయణ, శివప్రసాద్, ఉమ, సూర్యపాత్రో, తదితరులు పాల్గొన్నారు.

కౌలు గుర్తింపు కార్డులతో పంట రుణాలు



దుప్పాడలో కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందిస్తున్న ఏఓ, తదితరులు

విజయనగరం రూరల్: కౌలు రైతులకు అందిస్తున్న కౌలు గుర్తింపు కార్డులతో బ్యాంకు రుణాలు పొందవచ్చని మండల వ్యవసాయ అధికారి ఎం.ఉమామహేశ్వరనాయుడు అన్నారు. మండలంలోని జొన్నవలస, దుప్పాడ గ్రామాల్లో మంగళవారం గ్రామసభలు నిర్వహించి కౌలు రైతుల గుర్తింపు కార్డుల పంపిణీ చేపట్టారు. కౌలు రైతులు అందరూ తప్పనిసరిగా కౌలు గుర్తింపు కార్డులు (సీసీఆర్‌సీ) కార్డులు పొందాలని, అర్హులైన కౌలుదారులకు అన్నదాత సుఖీభవ పథకం వర్తిస్తుందని తెలిపారు. కౌలుదారులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో జొన్నవలస, దుప్పాడ గ్రామ సర్పంచులు కంది రమాదేవి, కరుమజ్జి లక్ష్మి, జొన్నవలస పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కెల్ల త్రినాథ్, గ్రామ పెద్దలు కరుమజ్జి రాములప్పడు, నడుపూరు రాంబాబు, గ్రామ వ్యవసాయ సహాయకుడు వంశీకృష్ణ పాల్గొన్నారు.

అక్రమ కేసులు ఎత్తివేయాలని వినతి



డీఆర్వో ఎస్‌డీ అనితకు వినతిపత్రం అందజేస్తున్న ఏపీజీఈఏ ప్రతినిధులు

విజయనగరం అర్బన్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణపై ఉన్న అక్రమ కేసులు ఎత్తివేయాలని ఆ సంఘం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ముందుగా సంఘం కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం డీఆర్వో ఎస్‌డీ అనితకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఎస్పీ యుగంధర్, సంఘం జిల్లా అధ్యక్షుడు కంది వెంకటరమణ, జిల్లా కార్యదర్శి బి.బాలభాస్కరరావు, జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ పువ్వల శ్రీనివాసరావు, అర్బన్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు చింతల వెంకటసతీష్, బియ్యాల చంద్రశేఖర్, జిల్లా ఉపాధ్యక్షుడు బాబాజీ పాణిగ్రాహి, పీఆర్ అనిల్‌కుమార్, వెంకటేశ్వరరావు, లెంక సత్తిబాబు, వివిధ మండలాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఉపాధ్యాయుల సర్దుబాటు



డిప్యూటీ ఈఓ వెంకటరమణకు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

విజయనగరం అర్బన్: పాఠశాలల్లో ఉపాధ్యాయుల సర్దుబాటు కోసం ఈ నెల 31వ తేదీ వరకు ఉన్న విద్యార్థుల సంఖ్యను తీసుకోవాలని ఉపాధ్యాయ ఉమ్మడి వేదిక జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు డీఈఓ కార్యాలయంలో డిప్యూటీ ఈఓ వెంకటరమణకు వేదిక ప్రతినిధులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఉపాధ్యాయ సంఘాలతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించాలని, డిజిటల్ లెసన్స్ ప్లాన్స్ అనుమతించాలని కోరారు. నిబంధనలకు విరుద్ధంగా అదనపు సెక్షన్లు నిర్వహిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్కౌట్ ఇన్‌స్ట్రక్టర్లుగా పీఈటీ/పీడీ టీచర్స్‌ను వినియోగించుకోవాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఉమ్మడి వేదికకు చెందిన వివిధ సంఘాల ప్రతినిధులు డి.శ్యామ్, రవీంద్రనాయుడు, పి.శ్రీనివాసరావు, రామునాయుడు, శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

చొరబాటుదారులను నిలువరించేందుకే 'సాగర కవచ్'



సమావేశంలో మాట్లాడుతన్న మెరైన్ సీఐ వైకుంఠరావు

● మెరైన్ సీఐ వైకుంఠరావు

భోగాపురం: సముద్ర మార్గం గుండా వచ్చే ఉగ్రవాదులు, చొరబాటుదారులను నిలువరించేందకు సాగర కవచ్ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని మెరైన్ సీఐ వైకుంఠరావు అన్నారు. భోగాపురం, పూసపాటిరేగ మండలాల్లో రెండు రోజుల పాటు నిర్వహించనున్న సాగరకవచం మాక్‌డ్రిల్‌పై మంగళవారం సాయంత్రం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన రాష్ట్రంలో 970 కిలోమీటర్ల మేర సముద్రతీరం విస్తరించి ఉందన్నారు. గతంలో గుర్తుతెలియని వ్యక్తులు, ఉగ్రవాదులు సముద్రమార్గం గుండా మన దేశంలోకి ప్రవేశించడం వల్ల ఎదుర్కొన్న ఇబ్బందులను గుర్తుచేసుకున్నారు. చొరబాటుదారులను నివారించేదుకు ప్రత్యేక నిఘా పెట్టినట్లు చెప్పారు. ఎస్పీ ఎం.దీపిక ఆదేశాల మేరకు రెండు మండలాల్లోని 16 మత్స్యకార గ్రామాల్లో ప్రత్యేక బందోబస్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మెరైన్ ఎస్సైలతో పాటు 197 మంది సిబ్బంది పాల్గొన్నారు.

గ్యాస్ట్రిక్ వ్యాధులపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న డాక్టర్ మహేంద్రగిరి

నెల్లిమర్ల: స్థానిక బైరెడ్డి కళ్యాణ మండపంలో ఉత్తరాంధ్ర గ్రామీణ వైద్య సంఘం ఆధ్వర్యంలో నెల్లిమర్ల, గుర్ల, మండల గ్రామీణ వైద్యులకు గ్యాస్ట్రిక్ వ్యాధులపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మహేంద్ర హాస్పిటల్ డాక్టర్ బి.మహేంద్రగిరి గ్యాస్ట్రిక్ వ్యాధులు, లక్షణాలు, చికిత్స విధానంపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం క్లోమ గ్రంథి కేసులు ఎక్కువగా పెరుగుతున్నాయని, మద్యం, మసాలా ఆహారం ఎక్కువ తినడం వల్ల గ్యాస్ట్రిక్ వ్యాధులు ప్రబలుతున్నాయని అన్నారు. అజీర్ణం, ఆకలి మందగించడం వంటి లక్షణాలు ఉన్నవారు వైద్యులను సంప్రదించి అవసరమైన పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఎండోస్కోపీ ద్వారా వ్యాధి నిర్ధారణ చేయవచ్చని అన్నారు. ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు గెద్ద చిరంజీవి మాట్లడుతూ కమ్యూనిటీ పారామెడికల్ శిక్షణ తరగతులు కొనసాగించేందుకు ప్రయత్నం చేస్తామన్నారు. కార్యక్రమంలో జోనల్ గౌరవ సలహాదారుడు మమ్ముల తిరుపతిరావు, జిల్లా సహాయ కార్యదర్శి మక్కువ రమణ, నెల్లిమర్ల ఇన్‌చార్జ్ గురాన అప్పారావు, భవాని, దివాకర్, ఏఓ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యవర్గ సమావేశం



మాట్లాడుతున్న రాష్ట్ర శిక్షణాధికారి ఎం.మోహనరావు, తదితరులు

విజయనగరం టౌన్: స్థానిక ఫూల్‌బాగ్‌లో ఉన్న భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రాంతీయ శిక్షణ కేంద్రంలో మంగళవారం జిల్లా కార్యవర్గ సభ్యుల సమావేశం జరిగింది. సమావేశంలో జిల్లాలో స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ల అభివృద్ధికి, ఆయా యూనిట్లలో ఉన్న సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. జోన్–1 ఇన్‌చార్జ్ రాష్ట్ర శిక్షణాధికారి ఎం.మోహనరావు ఆధ్వర్యంలో జిల్లా కార్యదర్శి వాక చిన్నంనాయుడు సమన్వయంతో నిర్వహించిన ఈ సమావేశంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ కమిషనర్ ఈపు విజయకుమార్, కె.సౌభాగ్యలక్ష్మి, బీపీఏ రాజు, వైస్ ప్రెసిడెంట్ సీహెచ్.నారాయణమూర్తి, వి.త్రినాథరావు, సహాయ కార్యదర్శి ఎస్.కనకమహాలక్ష్మి, డీఓసీలు డి.ప్రవీణ్‌కుమార్, కె.గాయత్రి, డీటీసీలు వి.సూర్యనారాయణ, హెడ్‌క్వార్టర్ కమిషనర్లు ఎస్ఎస్.దొర, ఎస్.పుష్పలత, ఏడీసీలు శ్రీనివాసశర్మ, రామలక్ష్మి, స్వరూప్, విజయలక్ష్మి, స్టేట్ మీడియా కరస్పాండెంట్ టీవీ రామ్‌కాశ్యప్, ఏఎస్ఓసీ దుర్గా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ప్రజాసంఘాల నేతలు



కలెక్టర్‌ను సత్కరిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

విజయనగరం ఫూల్‌బాగ్: స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను జిల్లాలోని వివిధ ప్రజా సంఘాల నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం, ప్రజా విజయం పుస్తకాన్ని, దళిత హక్కుల పోరాట సమితి డైరీని అందించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లాలో జరుగుతున్న అక్రమ మైనింగ్, చెరువులు, ప్రభుత్వ భూముల కబ్జాలను దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గోకా రమేష్‌బాబు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం సక్రమంగా అమలు జరిగేలా చూడాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ప్రజా విజయం అధ్యక్షుడు పుక్కెళ్ల షణ్ముఖరావు, సంతోష్, అయినాడ కృష్ణ, నాయీబ్రాహ్మణ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి.వి.దుర్గారావు, నాయకులు పప్పు విశ్వనాథం, కార్మిక నాయకులు రెడ్డి వెంకటరమణ తదితరులు ఉన్నారు.

విద్యార్థినుల ఆరోగ్యంపై దృష్టి సారించాలి



గుర్ల కేజీబీవీలో విద్యార్థినులకు వైద్యపరీక్షలు చేయిస్తున్న జడ్జి విజయకల్యాణి

చీపురుపల్లిరూరల్(గరివిడి): విద్యార్థినుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ(కేజీబీవీ) సిబ్బందికి విజయనగరం సివిల్ జడ్జి కె.విజయకల్యాణి సూచించారు. గుర్ల మండలంలోని కేజీబీవీని మంగళవారం ఆమె సందర్శించారు.తరగతి, వసతిగదులను, పిల్లల కోసం వండిన ఆహార పదార్థాలను పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడుతూ మెనూ ప్రకారం రోజు టిఫిన్, భోజనం అందిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేయించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్య జాగ్రత్తలు పాటిస్తూ, శ్రద్ధగా చదువుకోవాలని విద్యార్థినులకు సూచించారు. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటిని సాధించి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. జడ్జి వెంట ఎంపీడీఓ వెంకటరమణ, ఎంఈఓ భాను ప్రకాష్, కేజీబీవీ ఎస్ఓ ఝాన్సీ ఉన్నారు.

జ్వరాలపై ఇంటింటి సర్వే

వేపాడ: మండలంలోని ఓబలయ్యపాలెంలో జ్వరాలు విజృంభిస్తున్న నేపథ్యంలో సచివాలయ, వైద్య సిబ్బంది మంగళవారం ఇంటింట సర్వే నిర్వహించారు. బొద్దాం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరం రెండోరోజు కొనసాగింది. వైద్యాధికారి రమాదేవి, సిబ్బంది శిబిరంలో 56 మందికి వైద్యపరీక్షలు చేశారు.11 మంది జ్వరంతో బాధపడుతున్నట్లు గుర్తించారు. మలేరియా, డెంగ్యూ టెస్టులు చేశారు. జిల్లా మలేరియా అధికారి మణి గ్రామాన్ని సందర్శించారు. వైద్యశిబిరంలో సేవలపై సిబ్బందిని ఆరా తీశారు. ఇంటింట సర్వేను పరిశీలించి, ప్రజలకు ఆరోగ్య జాగ్రత్తలు సూచించారు. సర్పంచ్ దివదారి లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి కిశోర్ గ్రామంలో దోమల నివారణ మందు పిచికారీ చేయించారు. మలేరియా సబ్‌యూనిట్ అధికారి బి.శ్రీనివాసరావు, హెచ్ఎస్ మూర్తి, ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.